ఆనందభైరవి - ఆది

కంటి శుక్రవారము - గడియలేడింట
అంటి అలమేల్మంగ - అండనుండే స్వామిని

సొమ్ములన్నీ కడబెట్టి - సొంపతో గోణముగట్టి
కమ్మని కదంబము - కప్పు పన్నీరు
చెమ్మతోన వేష్టువలు - రొమ్ముతల మొల జుట్టి
తుమ్మెద మై చాయతోన - నెమ్మదినుండే స్వామిని

పచ్చకప్పరమె నూరి - పసిడి గిన్నెల నించి
తెచ్చి శిరసాదిగ - దిగనలది
అచ్చెరపడిచూడ - అందరికన్నులకింపై
నిచ్చమల్లె పూవువలె - నిటుతానుండే స్వామిని

తట్టుపునుగు కూర్చి - చట్టలు జేరిచి నిప్పు
పట్టి కరగించి వెండి - పళ్యాల నించి
దట్టముగ మేనునిండ - పట్టించి దిద్ది
బిట్టు వేడుక మురియుచుండే - బిత్తరి స్వామిని ॥కంటి॥

శుక్రవారాభిషేకం స్వామికి విశేషమైన సేవ. అన్నమాచార్యుల కాలంలో ఈ సేవ ఇలా జరిగేది. ఆపాదమస్తకం స్వామికి పునుగు తైలపుటభ్యంజనం చేసి, కుంకుమ పూవు మొదలైనవాటి మెత్తని పొడులతో నలుగుబెట్టి, పన్నీటితో శుద్ధోదకంతో స్నానమాడించి, తుడిచి, సర్వాంగములు చెమ్మలుఆరగా గర్పూరధూళి చల్లి మేదించి, దానిపైన పల్చపల్చగా పునుగు సుగంధతైలం రాచి, ముత్యాల తిరునామము, మంగతాళి మొదలైన దివ్యాభరణాలు, పట్టువస్త్రాలు, పుష్పహారాలూ అలంకరించేవారు.

తిరుమజ్జనవేళ అన్నమాచార్యులు స్వామిచెంత నలుగుపాటలు, అభిషేక కీర్తనలు పాడటమూ, అభిషేకానంతరం ఒక అభిషేకపు పన్నీటి చెంబూ, తాంబూల చందనాది సత్కారాలు స్వీకరించడం రివాజు. తిరుమజ్జనోత్సవం శాశ్వతంగా ఇలా జరుగుటకై అన్నమాచార్యులూ, తత్సుతులూ, స్వామికి కొన్ని అగ్రహారాలు కైంకర్యం చేశారు.

ఈనాడు తిరుమజ్జనోత్సవం ఇలా జరుగుతున్నది. పునుగు తైలంలో అభ్యంజనము, క్షీరఘటాభిషేకము, కుంకుమపువ్వు, కస్తూరి, కర్పూరం కలిపి నూరి బంగారు గిన్నెలలో పల్చగా జేసిన ద్రవ్యంతో నలుగు, స్వల్పంగా జలాభిషేకమూ జరుగుతాయి. అనుకు నలుగుతో కలసిన ఆ తీర్థం స్వామి పాద తీర్థంగా సేకరించిన తర్వాత విరివిగా జలంతో అభిషేకం జరుగుతుంది. తలతడి ఆరేటట్లు పాడిబట్ట పిడిచుట్టు కట్టి (పిడప కట్టి) దివ్య మంగళ విగ్రహమంతా పాడి బట్టతో తుడిచి ముఖముపై నీటిపూతగానూ తక్కిన సర్వాంగములపైనా దూమెరుగుగా పునుగుతైలము పూసి, ముఖమున కర్పూర చూర్ణం తో తిరునామము సాతుతారు. (ఆ కర్పూర చూర్ణమే తిరునామం మళ్లీ వారం తీసివేసిన ప్పడు శ్రీహరి మహాప్రసాదంగా సేకరించబడి, పంచబడుతుంది. ఆ నామానికి మధ్య కస్తూరీ తిలకం దిద్దుతారు.

తిరుమజ్జనోత్సవాన్ని అన్నమాచార్యులు తత్పుత్రులూ అతి మనోహరంగా అభివర్ణించారు. అభిషేక దర్శనం చేసిన సమయంలో అన్నమాచార్యులు ఆవిష్కరించిన ఆనందపు టందాల అతిశయపు కీర్తనమిది. శుక్రవారాభిషేక దర్శన భాగ్యం ఈ సంకీర్తనా గానం వల్ల తప్పక లభిస్తుంది.

ఈ వ్యాఖ్యకు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి 'అన్నమాచార్య చరిత్ర' పీఠికా, తాళ్లపాక తిరువేంగళనాథుని పరమయోగి విలాసమూ, అన్నమాచార్యుని యితర అభిషేక కీర్తనలూ ఆధారాలు. వారికి కృతజ్ఞాతాపూర్వక నమస్సులు.